క్లుప్తంగా

వైభవంగా అష్టాదళ పాద పద్మారాధన సేవ



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబా చంద్రశేఖర దేవస్థానంలో ఆషాడమాసం మొదటి మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంచే ప్రత్యేక అభిషేకం జరిపించారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం చేపట్టారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం కార్యక్రమాన్ని సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు, విజయకుమార్, నరసింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఐని సన్మానించిన ఎమ్మెల్యే



సీఐ రాజశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ: రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తూ ఇటీవల అనంతపురం జిల్లా బుక్కరాయ సముద్రంకు బదిలీపై వెళ్లిన రాజశేఖర్‌రెడ్డిని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మంగళవారం సన్మానించారు. ఆళ్లగడ్డలో చేసిన సేవలను ఆయన కొనియాడారు.

జగనన్న విద్యా కానుక పంపిణీ

రుద్రవరం: మండలంలోని 56 ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. మంగళవారం కోటకొండలో ఉపాధ్యాయ బృందం గ్రామ సర్పంచు డేగాని వెంకటేష్ చేతుల మీదుగా పంపిణీ చేయించారు.

సచివాలయం ఆకస్మిక తనిఖీ

చాగలమర్రి: మండలంలోని పెద్ద బోధనం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ మహబూబ్ దౌలా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. సిబ్బంది కార్యాలయానికి వచ్చే వారితో సభ్యతగా ప్రవర్తించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి సబియా న్నారు.

అక్రమ కేసులు బనాయించడం తగదు

నంద్యాల(న్యూటౌన్): అమాయికులపై అక్రమ కేసులు బనాయించడం పోలీసులకు తగదని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నంద్యాల పట్టణంలోని ప్రజలకు భద్రత కరువైందన్నారు. పోలీసుల వేధింపులకు గురై మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్న చినబాబు మృతిపై సమగ్ర విచారణ జరిపించి రూ.లక్ష నష్టపరిహారం చెల్లించి వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. సమావేశంలో సీపీఐ సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్

దొర్నిపాడు: రైతులకు పగలే నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని ఏఈ రామ సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో జెడ్పీటీసీ శకుంతల అధ్యక్షతన రైతులు, విద్యుత్ వినియోగదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పగలే 9 గంటల త్రీఫేస్‌ను సరఫరా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ కుక్కలయ్య, లైన్‌మెన్లు నాగన్న, శ్రీనివాసరెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగయ్య పాల్గొన్నారు.

బదిలీ హెచ్‌ఎంకు సన్మానం



బదిలీ హెచ్‌ఎంను సత్కరిస్తున్న దృశ్యం

రుద్రవరం: స్థానిక కన్యాకాపరమేశ్వరీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరెడ్డి ఇటీవల శిరివెళ్ల మండలం వీరారెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. ఆరేళ్ల పాటు హెచ్‌ఎంగా సేవలు అందించిన ఆయనను మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది మంగళవారం శాలువా, పూలమాలతో సత్కరించారు.

23 నుంచి ఇంటింటి సర్వే

శిరివెళ్ల: ఈ నెల 23 నుంచి ప్రభుత్వ పథకాలపై వలంటీర్లు, గృహ సారథులు ఇంటింటి సర్వే చేస్తారని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. ఎంపీడీఓతో కూడిన టీం 1వ తేదీన మహదేవపురం, తహసీల్దార్ టీం గుంప్రమాన్‌దిన్నె సచివాలయాలలో విచారణ చేస్తుందన్నారు. 4న జీనేపల్లె, గంగవరం, 6న యర్రగుంట్ల -1 సచివాలయం, గుండంపాడు, 7న యర్రగుంట్ల -2 సచివాలయం, బోయల కుంట్ల, 11న శిరివెళ్ల- 1, చెన్నూరు, 13న శిరివెళ్ల- 2, గోవిందపల్లె -1, 15న శిరివెళ్ల -3, గోవిందపల్లె- 2, 18న శిరివెళ్ల- 4, కోటపాడు సచివాలయాలలో టీంలు విచారణ చేస్తారని చెప్పారు.

ఉన్న ఊళ్లోనే ‘ఉపాధి’

- పెరిగిన వేతనం.. సంతృప్తిగా వసతులు, సౌకర్యాల కల్పన
- రోజుకు 15 వేల మందికి ఉపాధి పనులు
- ఇప్పటి వరకు 8.80 లక్షల పనిదినాలు పూర్తి



ప్రభుత్వం ఏర్పాటు చేసిన టెంటులో సేద తీరుతున్న దృశ్యం



ఆలమూరులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఆళ్లగడ్డ : వలసల నివారణకు ప్రవేశపెట్టిన ‘జాతీయ ఉపాధి హామీ పథకం’ గ్రామీణులకు వరంగా మారింది. ఉన్న ఊళ్లోనే.. కోరుకున్న చోట.. అడిగిన వెంటనే ఉపాధి పనులు కల్పిస్తున్నారు. దినసరి వేతనం పెంచడం, సకాలంలో వేతన సొమ్ములు జమ చేస్తుండటం, పనులు చేసే ప్రదేశాల్లో ప్రభుత్వం సౌకర్యాలు కల్పించడంతో నియోజకవర్గ వ్యాప్తంగా కూలీల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం రోజుకు 15 వేల మంది దాకా పనులకు హాజరవుతుండటంతో ఉపాధి పనులు చేసే చోట జాతరను తలపిస్తున్నాయి.

లక్ష్యానికి చేరులో..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల లక్ష్యాన్ని అధిగమించేందుకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ చేపట్టిన చర్యలు నియోజకవర్గంలో సత్ఫలితాలిస్తున్నాయి. జూన్ నెలాఖరులోపు 10 లక్షల పనిదినాలు కల్పించాలనే లక్ష్యానికి అధికారులు చేరువయ్యారు. ఇప్పటి వరకు సుమారు 9 లక్షల పనిదినాలను పూర్తి చేశారు. ఇప్పటి వరకు రూ 24.30 కోట్లు వేతనాలకు ఖర్చు చేశారు.

వ్యవసాయ పనులకు అధిక ప్రాధాన్యం

గతంలో వ్యవసాయ అనుబంధం పనులు కాకుండా ఇతర పనులు నిర్వహించేవారు. దీనివల్ల చాలవరకు ప్రయోజనం ఉండేది కాదు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి అత్యధికంగా వ్యవసాయ అనుబంధ పనులకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందులో భాగంగా పంట కాలువల్లో ముళ్ల పొదలు, కంప చెట్లు తొలగించడం చెరువుల్లో పూడికతీత, చేపట్టడం వల్ల కూలీలు కూడా ఆసక్తి చూపుతున్నారు.

పెరిగిన కూలి..

దరఖాస్తు చేసుకున్న వెంటనే జాబ్‌కార్డులు మంజూరు చేసి, వారు కోరుకున్న చోట పనులను చూపిస్తున్నారు. ఉపాధి హామీ పథకం పనులకు దినసరి కూలి రేట్లను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడంతో కూలీలకు ప్రయోజనం చేకూరుతోంది. ఇప్పటి వరకు కూలీలకు రూ 257 మేరకు చెల్లిస్తుండగా ఈ ఏడాది అదనంగా రూ 15 పెంచి దినసరి కూలి గరిష్టంగా రూ 272 అందిస్తుండటంతో ఆర్థికంగా లాభం చేకూరుతోంది.

గతం కంటే రెట్టింపైన పరిహారం

పనులు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు మృతి చెందితే వేతనదారునికి అందిచే పరిహారాన్ని పెంచారు. గతంలో పనిచేస్తున్న సమయంలో గాయాలైతే రూ 25 వేలు ఇచ్చేవారు. ఇప్పుడు దానిని రూ 50 వేలకు పెంచారు. అంగవైకల్యం చెందితే గతంలో రూ 50 వేలు చెల్లించేవారు. ఇప్పుడు దానిని రూ. లక్షకు పెంచారు. ప్రమాదంలో ఛాతినొప్పి, గుండెపోటు, వడదెబ్బతో మృతి చెందితే ఇంతకుముందు రూ 50 వేలు చెల్లించేవారు. ఇప్పుడు దానిని రూ 2 లక్షలకు పెంచారు.

వలస మాటే లేదు

కూలీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు మంజూరు చేసి వెంటనే పనులు కల్పిస్తున్నాం. పూర్తి పారదర్శకంగా పనులు చేపడుతున్నాం. జిల్లాలో వలస మాటే వినిపించడంలేదు. - రామచంద్రారెడ్డి, డ్వామా పీడీ

నియోజకవర్గంలో ఉపాధి పనుల వివరాలు..	
గ్రామ పంచాయతీలు -	104
ఉపాధి పనులకు పేర్లు నమోదు చేసుకున్న కుటుంబాలు-	7,142
మొత్తం జాబ్ కార్డుల సంఖ్య -	39548
పనిచేసే కూలీల సంఖ్య -	28,696

మంచి వేతనం లభిస్తోంది



మా ఊర్లోనే మేము కోరుకున్న పనినే కల్పించారు. ఇతర పనులు లేని కాలంలో ఉపాధి పనులతో రోజు రూ. 250 వరకు సంపాదించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించడం సంతోషం. మా ఇంట్లో రోజు నలుగురం పనికి వస్తుండటంతో రోజుకు రూ. వెయ్యి పైగానే వస్తుంది. కూలీ డబ్బులు కూడా సకాలంలో అకౌంట్‌లో పడుతున్నాయి. వారానికి రూ. 6 వేల నుంచి రూ. 7 వేల వరకు వస్తోంది. - దస్తగిరమ్మ, కృష్ణాపురం

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



ఎండాకాలంలో వ్యవసాయ పనులు లేక ఇబ్బందులు పడుతున్న మాకు అధికారులు ఉపాధి పనులు కల్పించారు. కూలీ డబ్బులు పెంచడంతో నాకు రోజుకు రూ. 270 దాకా వస్తోంది. దీనికి తోడు గతంలో కంటే ఏదైనా ప్రమాదం జరిగితే ఇచ్చే పరిహారం కూడా అంతకు అంత పెంచారు. పని చేసే చోట నీడ కోసం టెంట్, మందులు, ఓఆర్‌ఎస్ పాకెట్లు అన్ని అందుబాటులో ఉంచుతున్న ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. - లక్ష్మీదుర్గ, జి.జమ్మలదిన్నె

ప్రైవేటు పాఠశాలల దోపిడీని అరికట్టాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని కోరుతూ మంగళవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓకు వినతి పత్రం అందజేశారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ దుకాణాలను పెట్టి టై, బెల్ట్, షూ, యూనిఫాం పుస్తకాలను అమ్ముతున్నారన్నారు. సంపాదనే ధ్యేయంగా పాఠశాలలు నిర్వహిస్తున్న యాజమాన్యాలపై విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దందాను అరికట్టండి

చాగలమర్రి: మండలంలోని ప్రైవేటు పాఠశాలలో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని రాయలసీయ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జగన్ కోరారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం ఎంఈఓ అనురాధకు వినతి పత్రాన్ని సమర్పించారు.

పాదయాత్రను జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): పోలవరం నిర్వాసితులను ఆదుకోవాలని నిర్వహించే పాదయాత్రను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో పాదయాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం యాత్రను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జూలై 4వ తేదీ వరకు 15రోజుల పాటు 400 కిలోమీటర్లు పాదయాత్ర సాగుతుందన్నారు. 2013 భూ సేకరణ చట్టంప్రకారం పునరావాసం, పరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పుల్లా నరసింహ, గౌస్, లక్ష్మణ్, వెంకటలింగం, బంగారయ్య, సెల్వరాజ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర

- ఆలయానికి ఎమ్మెల్యే రూ.50 వేలు విరాళం



గంగమ్మ తల్లిని దర్శించుకుని రూ.50 వేలు నగదును ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామంలో గంగమ్మ జాతర గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా జరిగింది. సోమవారం అర్ధరాత్రి అనంతరం అమ్మవారికి పుష్పాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. వేకువజామునే భక్తులు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తరలివెళ్లి గంగమ్మకు అమ్మవారికి చీర, పసుపు, కుంకుమ, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి గ్రామానికి చేరుకోవడంతో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు బాలిరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, గోవిందరెడ్డిల ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం భక్తులతో కలిసి ఆలయానికి చేరుకుని గంగమ్మ తల్లిని ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రూ. 50 వేలు నగదును కమిటీ నిర్వాహకులైన పొట్టిపాటి రమణ, సుబ్రమణ్యం, సుబ్బయ్యలకు అందజేశారు. అలాగే మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, బీజేపీ నాయకులు భూమా కిశోర్‌రెడ్డిలతో పాటు వివిధ గ్రామాల నాయకులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకటరామయ్య ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యార్థి బస్సు సమస్య పరిష్కారం

రుద్రవరం: చాగలమర్రిలోని వాసవీ కళాశాలకు చెందిన పలు గ్రామాల విద్యార్థులు తమకు విద్యార్థి బస్సు రాక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి విన్నవించారు. చింతలచెరువు, కృష్ణంపల్లె, పెద్దవంగలి, చిన్నవంగలి గ్రామాల పెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు మంగళవారం ఎర్రగుడిదిన్నెలో కలిసి ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించారు. వెంటనే ఆయన ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్‌రెడ్డితో మాట్లాడటంతో ఈ నెల 26 నుంచి ఆయా గ్రామాల వరకు విద్యార్థి నడుస్తుందని చెప్పడంతో అందరు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న చైర్ పర్సన్ మాబున్నిసా

నంద్యాల(సిటీ): పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా జరగుతున్నాయని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా అన్నారు. మంగళవారం స్థానిక 1వ వార్డులో రూ. 13.50లక్షలతో టాయిలెట్ల నిర్మాణ పనులకు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలను కుల, మత, రాజకీయ బేధాలు లేకుండా అందిస్తున్నామన్నారు. 1వ వార్డు అభివృద్ధికి తమ సహకారం ఉంటుందని, ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం డంప్ యార్డును పరిశీలించి లెగసీ శుద్ధీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ రమణమూర్తి, డీఈఈ మధుకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్సద్ ఆదర్శ గ్రామాల్లో సమస్యలు గుర్తించండి

- నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానంద రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి

నంద్యాల: సన్సద్ ఆదర్శ గ్రామ యోజన పథకం కింద జిల్లాలో ఎంపిక చేసిన ఐదు గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి అవరోధంగా ఉన్న సమస్యలను గుర్తించి, పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానంద రెడ్డి ఇన్‌చార్జ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సన్సద్ ఆదర్శ గ్రామ యోజన పథకంపై జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌తో కలిసి సమీక్షించారు. ఎంపీ మాట్లాడుతూ ఈ పథకం కింద ఎంపిక చేసిన నంద్యాల మండలంలోని చాబోలు, జూపాడు బంగ్లా మండలంలోని పారుమంచాల, ఉయ్యాలవాడ మండలంలోని బోడెమ్మనూరు, గోవింద పల్లె, కోవెలకుంట్ల మండలంలోని రేవనూరు గ్రామాల్లో అధికారులు వారానికోసారి పర్యటించి సమస్యలను తెలుసుకోవాలన్నారు. పరిష్కరించలేని సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కార మార్గాలు అన్వేషిస్తామని చెప్పారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలి

జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ నంద్యాల పార్లమెంట్ సభ్యులు దత్తత తీసుకున్న 5 గ్రామాల్లో ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించడం, మెరుగైన ప్రాథమిక సౌకర్యాలు, అధిక ఉత్పాదకత, జీవనోపాధి అవకాశాలు, విస్తృత సామాజిక సమీకరణ తదితర అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. చాబోలు గ్రామానికి డీఆర్డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, పారుమంచాల గ్రామానికి ఏపీఎంఐపీ ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ, బోడెమ్మనూరు గ్రామానికి పట్టు పరిశ్రమ శాఖ డీడీ పరమేశ్వరి, గోవిందపల్లి గ్రామానికి పశుసంవర్ధక శాఖ జేడీ, రేవనూరు గ్రామానికి జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రావులను ఇన్‌చార్జ్ అధికారులుగా నియమించామన్నారు. ప్రభుత్వ నిధుల కేటాయింపుకు ఎదురు చూడకుండా గ్రామాభివృద్ధికి ఆయా గ్రామంలోనే సమకూర్చుకునేందుకు స్థానికంగా వనరులను అన్వేషించాలని గ్రామ సర్పంచులను, పంచాయతీ సెక్రెటరీలను కలెక్టర్ ఆదేశించారు. ఎంపీ లాడ్స్ కింద వివిధ అభివృద్ధి పనులకు సహకరించిన ఎంపీకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ రామ్మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు ముమ్మరం చేయండి

నంద్యాల: జగనన్న లేఅవుట్లలో జూలై 15 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 5లక్షల నిర్మాణాల్లో భాగంగా జిల్లాలో కేటాయించిన 18,500 గృహాలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ హౌసింగ్ ఇంజినీర్లు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాల పురోగతిపై సంబంధిత ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి కేటాయించిన 18,500 గృహాల లక్ష్యాన్ని వచ్చే నెల 15 నాటికి పూర్తి చేయాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన 12,967 గృహాలలో ఇప్పటి వరకు 2,314 గృహాలు ఇంకా ప్రారంభం కాలేదని వెంటనే గ్రౌండింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ పీడీ భాస్కర్ నాయుడు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా భూ సర్వే

ఉయ్యాలవాడ: భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు వైఎస్సార్ జగనన్న భూరక్ష సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని గోవిందపల్లె గ్రామంలో రైతులకు సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో మొదటి విడతగా కొండుపల్లె గ్రామంలో క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి రికార్డుల స్వచ్ఛీకరణ, భూములు కొలతలు వేసి హద్దులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులకు భూరక్ష పత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే ఈగ్రామంలో ఉన్న 150 మంది రైతులకు సంబంధించిన 605.11 ఎకరాలు విస్తీర్ణంలో సర్వే చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తులసీక్రిష్ణ, మండల సర్వేయర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ నిశాంతి

నంద్యాల: ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభమయ్యాయిని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ నిశాంతి సూచించారు. మంగళవారం నంద్యాల మండలంలోని బిల్లాలపురం గ్రామ సచివాలయంలో జరుగుతున్న భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సచివాలయాల్లో అన్ని రకాల దస్తావేజులు, వ్యవసాయ భూములు, వీలునామాలు, దత్తత మొదలైన రిజిస్ట్రేషన్లను చేసుకోవచ్చనన్నారు. ఆర్‌డీఓ శ్రీనివాసులు, జిల్లా రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డి, సబ్ రిజిస్ట్రార్ సునంద, పీఎల్ఆర్ డీటీ నాగరాజు ఉన్నారు.

జగనన్న సురక్షను పకడ్బందీగా నిర్వహించాలి

నంద్యాల(సిటీ): జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని చేయాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో సచివాలయ వార్డు సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుసంధానంగా ఈ నెల 23వ తేదీ నుంచి జులై 23వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మున్సిపల్ పరిధిలోని సచివాలయ స్థాయిల్లో పలు దఫాల్లో క్యాంపులు ప్రారంభించాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను పరిష్కారం త్వరితగతిన చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సెక్షన్ ఇన్‌చార్జ్ వెంకట కృష్ణ, సీనియర్ అసిస్టెంట్ వరమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల ఎంపీపీ (స్పెషల్) పాఠశాలకు దాతలు రూ.15వేలు విరాళం ఇచ్చినట్లు హెడ్‌మాస్టర్ అమరేశ్వరప్ప మంగళవారం తెలిపారు. రుద్రవరం తహసీల్దార్ తబ్బిబ్బు రవీంద్రప్రసాద్ రూ.5వేలు, మాజీ సర్పంచ్ వడ్లమూడి చలమయ్య రూ.5వేలు, సాఫ్ట్‌వేర్ ఇంజినీరు పాణ్యం చంద్రశేఖర్ కుమార్ రూ.5వేలు ఇచ్చారన్నారు. విద్యార్థుల నోట్ పుస్తకాల కోసం విరాళాలను ఖర్చు చేయనున్నట్లు చెప్పారు.

నిరాశ్రయులకు అన్నదానం

నంద్యాల(వ్యవసాయం): రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని రైల్వే స్టేషన్, బస్టాండ్, రోడ్డు ప్రాంతాల్లో ఉండే నిరాశ్రయులకు మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రాజునాయక్ మాట్లాడుతూ పట్టణంలో వివిధ ప్రాంతాల్లో భిక్షాటకులు, నిరాశ్రయులకు 300మంది దాకా ఆహారాన్ని పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ దుకాణాలపై ఆకస్మిక దాడులు

- రెండు టన్నుల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్న మున్సిపల్ అధికారులు
- రూ.50వేల జరిమానా



నిషేధిత ప్లాస్టిక్ కవర్ల నిల్వలు ఉన్న గోడౌన్‌లో తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

నంద్యాల(సిటీ): పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ కవర్లను నిల్వ ఉంచిన గోడౌన్ పై మున్సిపల్ అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పట్టణంలోని 10వ వార్డులోని పలు దుకాణాలను తనిఖీ చేసి నిషేధిత ప్లాస్టిక్ కవర్లను నిల్వ ఉంచిన గోడౌన్ యజమానికి రూ.50వేల జరిమానాతో పాటు పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నిషేధిత ప్లాస్టిక్ కవర్లు నిల్వ ఉంచడం, వాటిని విక్రయించడం చట్టారీత్యా నేరమన్నారు. ఇక పై పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. పట్టణంలో ఎక్కడైనా ప్లాస్టిక్ నిల్వలు ఉన్నట్లు తెలిస్తే నేరుగా మున్సిపల్ కమిషనర్ నెంబర్ 9849905860 ను సంప్రదించాలన్నారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రైతులకు అందుబాటులో ఉండండి

రుద్రవరం: రైతులకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన ఎరువులు, సలహాలు అందించాలని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ముత్తలూరు ఆర్‌బీకేను తనిఖీ చేశారు. ఆర్‌బీకేలోని రికార్డులు, నిల్వ ఉన్న ఎరువులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలైందని రైతులు పలు సమస్యలపై ఆర్‌బీకేల వద్దకు వస్తూ ఉంటారని, వీఏఏలు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఆర్‌బీకేల్లో యూరియా, డీఏపీ తదితర ఎరువులు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు వీఏఏలను సంప్రదించాలని తెలిపారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ మెహరున్నిసా బేగం, ఏఈఓ రాజు ఉన్నారు.

ఎమ్మార్పీకే ఎరువులను అమ్మాలి

శిరివెళ్ల: ఎరువులు, పురుగు మందులు ఎమ్మార్పీ కే అమ్మాలని ఏఓ సుధాకర్ సూచించారు. మంగళవారం యర్రగుంట్లలోని శ్రీశివసాయి ఫర్టిలైజర్, గురు ఏజెన్సీలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎరువుల నిల్వలు, ధరల పట్టిక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. పురుగుల మందులకు సంబంధించి ప్రిన్సిపుల్ సర్టిఫికెట్ (పీసీ) ఉండాలని, ఆ కంపెనీలకు చెందిన మందులు మాత్రమే విక్రయించాలని సూచించారు. రైతులకు తప్పని సరిగా బిల్లులు ఇవ్వాలన్నారు.

ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): ప్రైవేటు పాఠశాలల యజమానులు ప్రభుత్వ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ జిల్లాలో 157 పాఠశాలలు ఉండగా కేవలం 70 పాఠశాలలో మాత్రమే సేల్స్ బుక్ అమౌంట్ చెల్లించారని, మిగతావారందరూ తప్పకుండా చెల్లించాలన్నారు. ఆర్‌టీఈ ప్రకారం అర్హులైన విద్యార్థులకు తప్పని సరిగా పాఠశాలలో చేర్చుకొని ఉచితంగా విద్యను అందించాలన్నారు. సమావేశంలో ఎంఈఓ బ్రహ్మంనాయక్, శివరాంప్రసాద్, ఏఎంఓ లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

జగజ్జననీకి సారె సమర్పణ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని జగజ్జననీ నగర్‌లో వెలసిన శ్రీ జగజ్జననీ దేవాలయంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి చీర, సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. అమ్మవారి మూలవిరాట్‌కు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున మేళతాళాలతో నవదుర్గ వేషాధారణలో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని రకాల పిండి వంటకాలను నైవేద్యంగా సమర్పించారు.

క్రీడాకారిణికి అభినందనలు



క్రీడాకారుణిని అభినందిస్తూ చెక్కును అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శ్రీరామకృష్ణ విద్యాసంస్థల్లో బీబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న ఆంకాక్ష రాయలసీమ యూనివర్సిటీ తరపున ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రీయల్ టెక్నికాలజీ భువనేశ్వర్ వరల్డ్ యూనివర్సిటీలో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి ప్రతిభ చాటింది. ఈ మేరకు ఆర్‌యూ వైస్ ఛాన్సిలర్ ప్రొఫెసర్ ఏ.ఆనందరావు క్రీడాకారిణిని, కళాశాల స్పోర్ట్స్ అథారిటీ మేనేజర్ హేమంత్‌రెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక రామకృష్ణ విద్యాసంస్థల్లో క్రీడాకారిణికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జూలై 28 నుంచి చైనా దేశంలో జరిగే షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనేందుకు విద్యా సంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి రూ.1.99 లక్షల చెక్కును ప్రోత్సాహకంగా అందజేశారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు క్రీడల్లో ముఖ్యంగా షటిల్ బ్యాడ్మింటన్‌లో ఉన్నతస్థాయికి చేరుకొని తల్లిదండ్రులకు, కాలేజీకి మంచి పేరు తీసుకొని రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య, ప్రసాద్‌గురూజీ, అధ్యాపకులు లలిత సరస్వతి, కుమార్, వెంకటేశ్వర్లు, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.